అ'పూర్వ' సమ్మేళనం



సరస్వతి శిశుమందిర్‌లో..

మందమర్రిరూరల్: పట్టణంలోని శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో 2004-05 సంవత్సరం పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం సమావేశమయ్యారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకొని క్షేమసమాచారాలు అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలు నెమరేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు.



జైపూర్ ప్రభుత్వ పాఠశాలలో..

జైపూర్: జైపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల 2007-08సంవత్సరం పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఒకరినొకరు తమ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. తమకు చదువుచెప్పిన గురువులను సన్మానించారు.



ఏసీసీ పాఠశాలలో..

మంచిర్యాల అర్బన్: మంచిర్యాల ఎంసీడబ్ల్యూఈ హెచ్ఎస్(ఏసీసీ) పాఠశాలలో 2000-01 విద్యా సంవత్సరంలో పదోతరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు ఏకేఆర్ కన్వెన్షన్ హాల్లో ఆదివారం కలుసుకున్నారు. మళ్లీ 24ఏళ్ల తర్వాత ఒకే చోట కలుసుకోవడంతో, వారి ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. తమకు విద్యాబుద్ధులు నేర్పించిన గురువులను సైతం ఆహ్వానించారు.



'ఆక్స్‌ఫర్డ్'లో..

నస్పూర్: మున్సిపాలిటీ పరిధిలోని ఆక్స్‌ఫర్డ్ ఇంగ్లిష్ మీడియం స్కూల్లో 1999-2000 పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం రంగారెడ్డి జిల్లా ఐరవెల్లిలోని ఓ ప్రైవేటు రిసార్ట్‌లో ఆదివారం నిర్వహించారు. 25ఏళ్ల తర్వాత నిర్వహించిన ఈ సమ్మేళనానికి వివిధ రాష్ట్రాల్లో స్థిరపడిన 30మంది విద్యార్థులు హాజరయ్యారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఆహ్వానించి సన్మానించారు.

క్లుప్తంగా

నూతి అభిలాష్‌కు కవి శ్రేష్ఠ పురస్కారం



పురస్కారం అందుకుంటున్న అభిలాష్

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాలకు చెందిన ఉపాధ్యాయుడు, కవి నూతి అభిలాష్‌కు ఆదివారం కరీంనగర్ ఫిల్మ్ భవన్ వేదికగా పురస్కారం లభించింది. తెలుగు, ఆంగ్ల భాషలలో అనేక రచనలు చేసినందుకు గుర్తింపుగా గౌతమేశ్వర సాహితీ కళా సేవా సంస్థ, ఆర్యాణి సకల కళా వేదిక సంయుక్తంగా కవి శ్రేష్ఠ పురస్కారాన్ని అందించింది.

మల్లంపేట వాసికి అవార్డు

కోటపల్లి: మండలంలోని మల్లంపేట గ్రామానికి చెందిన చిందు యక్షగాన కళాకారుడు గడ్డం రామచంద్రుకి ఆర్యాణి కళావేదిక ఫిల్మ్ చాంబర్ ఆధ్వర్యంలో కవి గేయ రచయిత దూడపాక శ్రీధర్, స్వాతి, హరీశ్‌కుమార్ శర్మ చేతుల మీదుగా సంక్రాంతి పురస్కారం కళారత్న బిరుదు, స్వర్ణ కంకణం అందుకున్నారు. అవార్డు అందుకున్న రామచంద్రుని గ్రామస్తులు మల్లయ్య, పోచం అభినందిచారు.

నేడు మున్సిపాలిటీలో వార్డుసభలు

చెన్నూర్: చెన్నూర్ మున్సిపాలిటీలో సోమవారం ఆహార భద్రత కార్డుల మంజూరు కోసం 18వార్డులలో ఉదయం 11గంటలకు వార్డు సభలు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ తెలిపారు. వార్డు ప్రజలు వార్డు సభలకు హాజరై వార్డు ఆఫీసర్లకు సహకరించాలని తెలిపారు. వార్డు సభలు కౌన్సిలర్ల అధ్యక్షతన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అవకాశాన్ని ఆయా వార్డుల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాలలోని రాజీవ్‌నగర్‌లో గల మోడల్ స్కూల్లో వచ్చే విద్యా సంవత్సరానికి అడ్మిషన్ పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 6వ తరగతిలో 100సీట్ల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. 7వ తరగతి నుంచి 10 వరకు మిగిలిన సీట్ల కోసం కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వచ్చే నెల 28లోగా దరఖాస్తులు పంపించాలని కోరారు.

కార్యవర్గం

శ్రీరాంపూర్: ఐఎన్టీయూసీ అనుబంధ ఆశా వర్కర్స్ యూనియన్ మంచిర్యాల జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. సీసీసీ కార్నర్‌లోని మల్లారెడ్డి ఫంక్షన్‌హాల్లో ఆదివారం యూనియన్ సమావేశం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు మైమూదా, ఉపాధ్యక్షురాలు ఆడెపు శ్యామల, ప్రధాన కార్యదర్శి శ్రీదేవి హాజరయ్యారు. సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా విజయ, ప్రధాన కార్యదర్శిగా సీహెచ్ రాజేశ్వరీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు ఎడ్ల శంకరమ్మ, శారద, రజిత, రాజేశ్వరీ, జ్యోతి, నిర్మల, లలిత, సుజాత పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆదివాసీలు

కాసిపేట: మండలంలోని కుర్రెఘడ్‌లో ఈ నెల 29నుంచి 31వ తేదీ వరకు నిర్వహించే పాహుండి కపార్ లింగుస్వామి జాతర విజయవంతం చేయాలని ఆదివాసీలు కోరారు. కుర్రెఘడ్‌లోని ఆలయ సమీపంలో ఆదివారం గురుస్వామి కుర్సింగ భూదేవన్ ఆధ్వర్యంలో మండలంలోని వివిధ గ్రామాల పటేల్లు, యువత, మహిళలు, అన్ని కులాల ఆదివాసీ సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించి ఏర్పాట్లపై సమీక్షించారు. జాతరకు సంబంధించిన పోస్టర్లు గొండ్వాన గోండ్ జాతీయ నాయకుడు సిడాం అర్జు మాస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో కృష్ణరావ్, మధు, సురేందర్, రాము, రాజశేఖర్, తిరుపతి, మనోజ్, వినోద్ తదితరులున్నారు.

గ్రామాల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి

• చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి

భీమారం: చెన్నూర్ నియోజకవర్గంలోని గ్రామాల అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టిపెట్టిందని చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్‌వెంకటస్వామి అన్నారు. మండలంలోని లాల్‌బహదూర్‌పేట గ్రామంలో ఆదివారం రూ.5లక్షలతో నిర్మించే సీసీ రోడ్ల పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం గ్రామాల అభివృద్ధిపై ఎలాంటి దృష్టి పెట్టలేదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సామాన్యులకు ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తుందన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో రోడ్లను అభివృద్ధి చేస్తే గ్రామాలు ఆర్థికంగా అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో చెన్నూర్ నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు బీటీ రోడ్లతో పాటు సీసీ రోడ్లు నిర్మించేందుకు నిధులు మంజూరు చేస్తున్నామని తెలిపారు. వైద్య సేవలను పేద ప్రజల ముంగిట్లోకి తీసుకొస్తున్నట్లు తెలిపారు. ఎలకేశ్వరం నుంచి ఆరెపల్లి క్రాస్‌రోడ్డు వరకు బీటీ రోడ్డు నిర్మిస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు పొడేటి రవి, మండల కమిటీ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, నాయకులు గద్దె రాంరెడ్డి, సత్తిరెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

'మార్నింగ్ వాక్‌తో సమస్యలు పరిష్కారం'

చెన్నూర్: చెన్నూర్ మున్సిపాలిటీలో గల దళితవాడలతో పాటు పలు వార్డులలో ఆదివారం మున్సిపల్ అధికారులతో కలిసి స్థానిక ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి మార్నింగ్ వాక్ నిర్వహించారు. వాడల్లో తిరుగుతూ ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మార్నింగ్ వాక్‌లో ప్రజలు తన దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం బట్టిగూడెంలో గల లక్ష్మీదేవర ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు గిరెల్లి మల్లయ్య ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



జైపూర్: బ్యాటింగ్ చేస్తున్న ఎమ్మెల్యే వివేక్

గెలుపోటములు సమానంగా తీసుకోవాలి

జైపూర్: యువకులు క్రీడలను స్ఫూర్తిగా తీసుకొని రాణించాలని ఆటల్లో గెలుపోటములు సమానంగా స్వీకరించాలని ఎమ్మెల్యే వివేక్ తెలిపారు. జైపూర్ మండల కేంద్రంలో వారం రోజులుగా కొనసాగుతున్న వీపీ-క్రికెట్ టోర్నమెంట్ పోటీలను ఆదివారం ఆయన సందర్శించారు. కాసేపు సరదాగా బ్యాటింగ్ చేశారు. అనంతరం ఉదయం జరిగిన మ్యాచ్‌లో గెలుపొందిన వారికి బహుమతులు ఇచ్చారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు రవీందర్‌రెడ్డి అయ్యస్వామి జ్ఞాపిక, ప్రసాదం అందించారు. కార్యక్రమాల్లో నాయకులు లక్ష్మణ్, సంపత్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఫయాజ్, శ్రీనివాస్‌గౌడ్, విశ్వంభర్‌రెడ్డి, గొనె నర్సయ్య, తదితరులు ఉన్నారు.

షౌకత్ అలీఖాన్ సేవలు మరువలేనివి.

మందమర్రిరూరల్: పట్టణంలోని రామన్‌కాలనీలో కేకే విద్యావిహార్ విద్యా సంస్థల వ్యవస్థాపకులు షౌకత్ అలీఖాన్ సంస్మరణ సభను ఆదివారం పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ హాజరై షౌకత్ అలీఖాన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన పేరిట ఏర్పాటు చేయనున్న లైబ్రరీ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, షౌకత్ అలీఖాన్ కుటుంబ సభ్యులు, ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్‌లు, తదితరులు ఉన్నారు.

అర్హులందరికీ రేషన్ కార్డులు

భీమారం: అర్హులందరికీ రేషన్‌కార్డులు అందజేస్తామని ఎమ్మెల్యే వివేక్ వెల్లడించారు. రేషన్ కార్డుల సర్వేపై జరుగుతున్న వదంతులను ఆయన ఖండించారు. ఈ మేరకు ఆదివారం భీమారం మండల కేంద్రానికి వచ్చిన వివేక్ విలేకరులతో మాట్లాడారు. పేదప్రజలకు పీడీఎస్ బియ్యం అందించేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారికి అర్హతలను బట్టి కార్డులు అందజేయనున్నట్లు తెలిపారు. గత పదేళ్లలో గత ప్రభుత్వం పేదలకు ఒక్క రేషన్ కార్డు కూడా మంజూరు చేయలేదని ఆరోపించారు. కాని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం పేదలకు రేషన్ కార్డులు ఇచ్చే ప్రక్రియ ప్రారంభించిందన్నారు. రేషన్‌కార్డులు మంజూరు చేసినట్లు ఇప్పటివరకు ప్రభుత్వం ఎలాంటి జాబితాలు విడుదల చేయలేదని, గ్రామసభలు నిర్వహించి కార్డులు మంజూరు చేయనున్నట్లు ప్రకటించారు. దరఖాస్తు చేసుకోని కుటుంబాలు, మళ్లీ అధికారులకు తమ దరఖాస్తులు ఇవ్వవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు రవి, మాజీ జెడ్పీటీసీ రాజ్‌కుమార్, నాయకులు లక్ష్మణ్, సత్తిరెడ్డి పాల్గొన్నారు.

నిలిచిన నీరు.. ప్రయాణికులు బేజారు



భీమారం: మంచిర్యాల-చెన్నూర్ జాతీయరహదారిపై పోలంపల్లి సమీపంలో పంట పొలాల నుంచి వచ్చే వృథా నీళ్లు రోడ్డుపై ప్రవహిస్తుండడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారుతోంది. ఈ పరిస్థితి గత సంవత్సరం నుంచి ఉన్నా దీనిపై నేషనల్ హైవేస్ అధికారులు పట్టించుకోవడంలేదు. ఇప్పటికైనా నేషనల్ హైవేస్ అధికారులు చర్యలు చేపట్టి రోడ్డు పక్కన కాలువలు నిర్మించాలని, రోడ్డుపై నీరు నిలువకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

క్రికెట్‌పోటీల విజేత మాదారం జట్టు

తాండూర్: మండలంలోని మాదారం టౌన్‌షిప్ లాల్ బహదూర్ స్టేడియంలో పక్షంరోజుల నుంచి నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలు ఆదివారం అట్టహాసంగా ముగిశాయి. మాదారం క్రికెట్ క్లబ్ (ఎంసీసీ) ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించగా 28జట్లు హాజరయ్యాయి. ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన క్రికెట్ పోటీల్లో మాదారం క్రికెట్ క్లబ్ జట్టు విన్నర్స్‌గా నిలవగా, ఐబీ 11 క్రికెట్ జట్టు రన్నర్స్‌గా నిలిచింది. విన్నర్స్‌గా నిలిచిన మాదారం క్రికెట్ జట్టు క్రీడాకారులకు రూ.20వేలు క్యాష్‌మనీని, ట్రోఫీని డీసీసీ ఉపాధ్యక్షుడు సూరం రవీందర్‌రెడ్డి సొంతంగా అందజేశారు. రన్నర్స్‌గా నిలిచిన ఐబీ 11జట్టుకు రూ.10వేలు క్యాష్‌మనీ, ట్రోఫీని క్రికెట్ పోటీల నిర్వాహకులు అందించారు. క్రికెట్ పోటీలు ఉత్సాహపూరిత వాతావరణంలో జరగడంపై నిర్వాహకులను, క్రీడాకారులను రవీందర్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ గోలేటి బ్రాంచ్ ఉపాధ్యక్షుడు బయ్య మొగిలి, ఐఎన్‌టీయూసీ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్, మండల యూత్‌కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు పుట్ట శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు ట్రోఫీ అందిస్తున్న రవీందర్‌రెడ్డి

క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలి

కాసిపేట: యువత క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలని మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ముత్యంపల్లి అంబేడ్కర్ మైదానంలో ఆదివారం కేఎంపీఎల్(కాసిపేట మండల ప్రీమియర్ లీగ్) సీజన్ త్రీ క్రికెట్ పోటీలను ముఖ్యఅతిథిగా హాజరై బ్యాటింగ్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత చదువుతో పాటు ఆటల్లో రాణించి ఉత్తమ క్రీడాకారులుగా ఎదగాలన్నారు. నేటి యువత నిషేధిత మత్తు పదార్థాలకు బానిసై విలువైన జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, మత్తు పదార్థాలు లేని సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో కాసిపేట ఎస్సై ప్రవీణ్‌కుమార్, ఫారెస్ట్ డెప్యూటీ రేంజ్ అధికారి ప్రవీణ్ నాయక్, నిర్వాహకులు మెరుగు శ్రీనివాస్, దాసరి శంకర్, నామసాని రాజు, కంటం తిరుపతి, పది ఫ్రాంచేజీ యాజమాన్యాలు, క్రీడాకారులు పాల్గొన్నారు.



పోటీలు ప్రారంభిస్తున్న సీఐ శశిధర్‌రెడ్డి

సర్వే త్వరగా పూర్తి చేయాలి

• బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ

తాండూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అములు చేయబోతున్న నాలుగు పథకాలకు సంబంధించిన సర్వేను సత్వరంగా పూర్తి చేయాలని బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ అధికారులను ఆదేశించారు. తాండూర్ మండలంలో నిర్వహిస్తున్న రైతుభరోసా, రేషన్ కార్డుల పథకాలకు సంబంధించిన భూ ఇంటింటి సర్వేను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్వే సమగ్రంగా చేయాలన్నారు. తప్పులు లేకుండా, పొరపాట్లకు ఆస్కారం లేకుండా చూడాలని సూచించారు. అర్హులకు ప్రభుత్వ పథకాలు దక్కేలా చూడాల్సిన బాధ్యత అధికారులదేనని పేర్కొన్నారు. ఇందుకు ప్రభుత్వ అధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించాలని కోరారు. ఆర్డీవో వెంట తాండూర్ మండల ఇన్‌చార్జి తహసీల్దార్ ప్రసాద్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



సర్వేను పరిశీలిస్తున్న ఆర్డీవో హరికృష్ణ

21నుంచి 'రైతుభరోసా' గ్రామసభలు

భీమిని: భీమిని, కన్నెపల్లి మండలాల్లో గ్రామసభలు నిర్వహించి అర్హులైన వారి నుంచి రైతుభరోసా, రేషన్‌కార్డుల అప్లికేషన్‌లు స్వీకరించనున్నారు. మంగళవారం నుంచి ఎంపీడీవో, తహసీల్దార్లు, పలు శాఖల అధికారులతో టీంల వారిగా వివరాలను సేకరించేందుకు ప్రణాళికాలు సిద్ధం చేశారు. భీమిని మండలంలో 21న అక్కలపల్లి, కేస్లాపూర్, మల్లీడి, ఖర్జీభీంపూర్, 22న పెద్దపేట, వీగాం, వెంకటాపూర్, బిట్టురుపల్లి, భీమిని, చిన్నగుడిపేట 23న చిన్న తిమ్మాపూర్, లక్ష్మీపూర్‌లలో కన్నెపల్లి మండలంలో 21న సుర్జాపూర్, గొల్లగట్టు, వీరాపూర్, పోలంపల్లి, టేకులపల్లి, జన్కాపూర్, జజ్జరవెల్లి, రెబ్బెన, ముత్తపూర్, కన్నెపల్లి, 22న మెట్‌పల్లి, నాయకునిపేట, మడవెల్లి, సాలీగాం, లింగాల గ్రామాల్లో రైతుభరోసా గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవోలు గంగామోహన్, శంకర్ తెలిపారు.

మంచిర్యాలరూరల్(హాజీపూర్): రైతుభరోసా, ఇందిరమ్మ ఇళ్ల, రేషన్ కార్డుల పంపిణీకి సంబంధించిన లబ్ధిదారుల ఎంపిక గ్రామసభలు 21, 22, 23, 24తేదీల్లో ఆయా గ్రామాల పంచాయతీల ఆవరణలో నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసరావుదేశ్‌పాండే, ఎంపీడీవో ప్రసాద్, ఏవో కృష్ణ ఆదివారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. 21న గఢ్‌పూర్, చిన్నగోపాల్‌పూర్, నాగారం, ర్యాలీపెద్దంపేట, దొనబండ, 22న కర్ణమామిడి, బుద్ధిపల్లి, పడ్తనపల్లి, నంనూర్, నర్సింగాపూర్, 23న హాజీపూర్, గుడిపేట, వేంపల్లి, రాపల్లి గ్రామాల్లో 24న ముల్కల్ల, టీకానపల్లి గ్రామాల్లో నిర్వహిస్తున్న గ్రామసభలకు స్థానికులు, మాజీ ప్రతినిధులు, లబ్ధిదారులు, సంబంధిత అధికారులు హాజరుకావాలని తెలిపారు.

పేదలకు సంక్షేమ పథకాలు అందిస్తాం

• మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు

మంచిర్యాలటౌన్: ప్రభుత్వ సంక్షేమ పథకాలను పేదలందరికీ అందించడమే ప్రభుత్వ ధ్యేయమని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఆదివారం నియోజకవర్గానికి చెందిన 106మంది లబ్ధిదారులకు రూ.32,38,500 విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందించారు. కార్యక్రమంలో మంచిర్యాల మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య, వైస్ చైర్మన్ సల్ల మహేశ్, నస్పూర్ మున్సిపల్ చైర్మన్ వేణు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు తూముల నరేశ్, వార్డు కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.



చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

ఎన్నికల హామీ అమలు చేయాలి

పాతమంచిర్యాల: సింగరేణి కార్మికులకు ప్రభుత్వం సొంత ఇంటి పథకాన్ని అమలు చేయాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజిరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో ఆదివారం ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావును కలిసి వినతిపత్రం సమర్పించారు. సింగరేణి సంస్థలో పనిచేస్తున్న కార్మికులు రిటైర్మెంట్ తర్వాత నివాస స్థలం లేక చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్మిక సంఘాల ఎన్నికల సందర్భంగా కార్మికులకు సొంత ఇంటి పథకాన్ని అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని, హామీని అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ శ్రీరాంపూర్ డివిజన్ అధ్యక్షుడు గూళ్ల బాలాజీ, సెక్రెటరీ వెంగళ శ్రీనివాస్, బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్, కాసిపేట ఫిట్ కార్యదర్శి సురేష్, బ్రాంచ్ అధ్యక్షుడు రాజమౌళి పాల్గొన్నారు.

అర్హులకు రేషన్‌కార్డు మంజూరు చేయాలి

తాండూర్: అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ రేషన్‌కార్డు మంజూరు చేయాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి చిలుముల శ్రీకృష్ణదేవరాయలు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల ఏళ్ల తరబడిగా రేషన్‌కార్డులు మంజూరు కాలేదన్నారు. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జరిగిన ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్న పేదలకు రేషన్‌కార్డు మంజూరు చేసే బాధ్యత ప్రభుత్వానిదేని అన్నారు. ప్రభుత్వం తాజాగా ప్రకటించిన జాబితాలో అర్హుల పేర్లు లేవని, లేని వ్యక్తుల పేర్లను జత చేయాలన్నారు. లేనిపోని నిబంధనలు పెట్టి పేదలకు అన్యాయం చేయొద్దన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. గూడులేని పేదలకు ఇళ్లను మంజూరు చేయాలని పేర్కొన్నారు.

రక్తదాన శిబిరానికి స్పందన



చెన్నూర్‌లో రక్తదానం చేస్తున్న యువకులు

చెన్నూర్: మున్సిపాలిటీ పరిధిలోని ఓ ఫంక్షన్ హాల్లో ఆదివారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి యువకుల నుంచి స్పందన లభించింది. లయన్స్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు జాడి తిరుపతి, వెంకటనర్సయ్య మాట్లాడారు. రక్తదాన శిబిరానికి పెద్ద ఎత్తున యువకులు వచ్చి రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. 77మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ చీఫ్ కో ఆర్డినేటర్ మధుసూదన్‌రెడ్డి, చందురి మహేందర్, ఎం.వెంకటేశ్వర్, నిమ్మల సాగర్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలానికి చెందిన 22మంది లబ్ధిదారులకు ఆర్థిక చేయూత కింద ఎమ్మెల్యే నివాస గృహంలో ఆదివారం ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు చేతుల మీదుగా సీఎం సహాయ నిధి చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో హాజీపూర్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పూస్కూరి శ్రీనివాసరావు, చిప్పకుర్తి లచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సమావేశం

లక్సెట్టిపేట: మండలకేంద్రంలోని ఐబీ ఆవరణలో బీజేపీ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. నూతన మండలాధ్యక్షుడు హేమంత్‌రెడ్డిని సన్మానించారు. కార్యకర్తలు, నాయకులు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, ప్రతి ఒక్కరూ సైనికుల్లా విధులు నిర్వర్తించాలని కోరారు. పార్టీ సభ్యత్వాలు పెంచేందుకు కృషి చేయాలన్నారు.